

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మల్లేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య





రంగాపూర్ వద్ద లారీని ఢీకొట్టిన ఘటనలో నుజ్జునుజ్జయిన పెళ్లి బస్సు



# దారి కాచిన మృత్యువు!

## హైదరాబాద్-బీజాపూర్ హైవేపై మృత్యుఘోష

- లారీని ఢీకొన్న పెళ్లి బస్సు
- నలుగురు దుర్మరణం, 31 మందికి గాయాలు
- సీతారాంపూర్, సోలిపేట్, రావులపల్లి, కిషన్‌నగర్‌లో విషాద ఛాయలు
- మృతులంతా వరుడి బంధువులే
- ఒక్కొక్కరిది ఒక్కోగాథ
- కదిలిస్తే కన్నీటి సాగరమే..



గాయాలైన వధువు మల్లీశ్వరిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న బంధువు



వరుడు సంతోష్

పచ్చని పందిరి, మామిడి తోరణాలు, భాజాభజంత్రీల మోత, బంధువుల రాకపోకలు, పిల్లల ఆటపాటలతో నిన్న మొన్నటి వరకు సందడిగా ఉన్న ఆ ఇంట్లో పెనువిషాదం అలుముకుంది. అంగరంగ వైభవంగా పెళ్లి జరిగిందనే ఆనందం క్షణాల్లో ఆవిరై పోయింది. వివాహం తర్వాత బంధువులంతా కలిసి వధువు ఇంటికి వెళ్లి చేసిన విందు వారికి అదే చివరిదైంది. అప్పటివరకు ఒకరినొకరు ఆట పట్టించుకుంటూ సరదాగా గడిపి వారు తిరిగి వరుడి ఇంటికి వస్తుండగా మృత్యువు కబళించింది. పెళ్లి బృందం వెళ్తున్న బస్సు రోడ్డుపై ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టడంతో నలుగురు మృత్యు ఒడిలోకి చేరారు. 31 మందికి పైగా గాయాలు కాగా, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ హృదయ విదారక సంఘటన వికారాబాద్ జిల్లా రంగాపూర్ సమీపంలో చోటుచేసుకుంది.

షాబాద్/షాద్‌నగర్/చేవెళ్ల/పరిగి, మే 20(ఆంధ్రజ్యోతి): వివాహ విందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వికారాబాద్ జిల్లా రంగాపూర్ సమీపంలో ఆగిఉన్న లారీని బస్సు అతివేగంతో ఢీకొట్టింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా, 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన వారంతా రంగారెడ్డి జిల్లా వాసులే. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. షాబాద్ మండలం చందన్‌వెల్లి గ్రామానికి చెందిన మంగలి రామస్వామి-మంజుల కుమారుడు సతీష్‌కుమార్ వివాహం పరిగికి చెందిన మల్లీశ్వరితో ఈనెల 16న వివాహం జరిగింది. సోమవారం వధువు

మిగతా 7వ పేజీలో...

### సందీప్ మృతితో దిక్కులేనివారైన తల్లి, భార్య



కన్నతల్లి కడుపున ఒకే ఒక్కడు పుట్టాడు. కట్టుకున్న ఇల్లాలికి తానే సర్వస్వం. గత నవంబర్‌లోనే వివాహం చేసుకున్నాడు. త్వరలో ఓ బిడ్డకు తండ్రి కానున్నాడు. ఇంతలోనే అనుకోని విషాదం ఆ కుటుంబాన్ని కుదిపేసింది. అమ్మను అనాథగా మార్చి, ఇల్లాలిని అగాధంలోకి నెట్టి మృత్యుఒడికి చేరాడు. వికారాబాద్ జిల్లా పరిగి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ఫరూక్‌నగర్ మండలం కిషన్ నగర్ నివాసి సందీప్ మరణం వెనుక విషాదం ఇది. ఈ యువకుడు బ్యూటీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అంతేకాకుండా ప్రస్తుతం ఇతని భార్య మహేశ్వరి గర్భవతి. ఇలాంటి తరుణంలో సందీప్ మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పెంకుటింటిలో నివసిస్తూ రెక్కాడించి డొక్కలు నింపుకుంటున్న ఈ కుటుంబంలో చోటు చేసుకున్న ఈ విషాదం ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తుంది.

### పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబం

మల్లేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కు కోల్పోయింది మల్లేష్ నాగరగూడలో హెయిర్ కటింగ్‌షాప్‌ను నిర్వహిస్తున్నాడు. దానిపైనే ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు అతనికి భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్ల మనస్వి(6), ఆద్య(2) కుమారుడు ప్రనీల్(4) ఉన్నారు. మల్లేష్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. భార్య, తల్లి ఆర్తనాదాలు మిన్నంటాయి. నాన్న కావాలి అంటూ పిల్లలు ఏడుపును చూసిన గ్రామస్తులు కంటతడి పెట్టారు.



### రోడ్లు రక్తసిక్తం

- జనవరి నుంచి ఇప్పటి వరకు 59 ప్రమాదాలు
- 33 మంది మృతి, 150మందికిపైగా క్షతగాత్రులు

7

హైవేపై పెట్రోలింగ్ ఎక్కడ?

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి



మోమిన్‌పేట్‌లో తనిఖీ చేస్తున్న మోహన్‌రెడ్డి

మోమిన్‌పేట్, మే 20(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం రైతు వేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను సీజన్ పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలన్నారు. పత్తి ప్యాకెట్లను సైతం భద్రంగా పెట్టుకోవాలన్నారు. పంట నష్టం జరిగిన సమయంలో సంబంధిత కంపెనీల నుంచి పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఫర్టిలైజర్స్ దుకాణాల డీలర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు ప్రదర్శించాలన్నారు. స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రతీ రోజు ఎరువులు, విత్తనాల వివరాలను మండల వ్యవసాయ శాఖ అధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను తాండూర్ మార్కెట్‌కు పంపించేందుకు మార్కెట్ డీఎంతో చర్చించారు. రైతులు తప్పనిసరిగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద టోకెన్లు తీసుకొని తేమ శాతం తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భూపతి జయశంకర్, విస్తరణ అధికారులు పెంటయ్య, చంద్రిక, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

వికారాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో జనరల్, ఒకేషనల్ పరీక్షలకు కలిపి మొత్తం 8,059 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా జిల్లాలో మొత్తం 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్‌లో 5, తాండూరులో 4, పరిగిలో 4, నవాబ్‌పేట్, పెద్దేముల్, మర్పల్లి, మోమిన్‌పేట్, దోమ, కొడంగల్, కులకచర్ల మండల కేంద్రాల్లో ఒక్కో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్స్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

# ఇక అన్ని గ్రామాల్లో భూ భారతి

## సదస్సులకు సిద్ధమౌతున్న అధికారులు

**భూ సమస్యల పరిష్కారానికి చర్యలు.. కీసరలో దరఖాస్తుల పరిశీలన**



రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్(ఫైల్)

మేడ్చల్ ప్రతినిధి, మే 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలోని అన్ని గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టంపై అవగాహన కల్పించడానికి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా కీసర మండలాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగియడంతో ఇక జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు మండలం కీసరలోని 12 గ్రామాల్లో భూ భారతి చట్టంపై నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ముగిశాయి. వాటిని సమస్యల వారీగా విభజించే ప్రక్రియ చేపట్టారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా భూ భారతి చట్టాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో మిగిలిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 15 మండలాల్లో ఈ సదస్సులు నిర్వహించాల్సి ఉండగా,

మిగతా 8వ పేజీలో...

**కీసర మండల వివరాలు**

| | |
|---|---|
| మొత్తం దరఖాస్తులు | 1054 |
| ఆన్‌లైన్‌లో వచ్చినవి | 525 |
| పాసుపుస్తకాల కోసం | 709 |
| తప్పుగా నమోదైనవి | 22 |
| సవరణలు చేయాల్సినవి | 125 |
| ప్రొహిబిటెడ్ లీస్టులో ఉన్నవి | 103 |
| మీ సేవ ద్వారా వచ్చినవి | 10 |
| అసైన్డ్ భూములవి | 17 |
| ఓఆర్సీల కోసం | 38 |
| ఇతర సమస్యలపై | 68 |

### దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన 28 మండలాల్లో కీసర ఒకటి. ఇక్కడ భూ భారతి రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయి. మొత్తం 1,054 దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిష్కారానికి దరఖాస్తుల పరిశీలిస్తున్నాం. త్వరలోనే అన్ని భూ సమస్యలను పరిష్కరించి ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

- ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో, కీసర



మాట్లాడుతున్న వికారాబాద్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ

# సత్వర వైద్య సేవలు అందించాలి

వికారాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): పల్లె దవఖానాలకు ఎంఎల్‌హెచ్‌పీలు సమయానికి విధులకు హాజరై ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరవణ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు(ఎంఎల్‌హెచ్‌పీ) జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధుల్లో నిర్లక్ష్యం చూపకుండా ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, కీటక జనిత వ్యాధుల నివారణ వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల గురించి వివరించారు. ప్రజలకు అందించిన వైద్య సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బతగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇటీవల ఫార్మసిస్టులకు ఆఫీసర్ హోదా కల్పించిన సందర్భంగా ఫార్మసిస్ట్ అసోసియేషన్ వారు జిల్లా ఆరోగ్య శాఖ అధికారిని సత్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జీవరాజ్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ బీటీ జానీ, డాక్టర్ నిరోషా, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ నిఖిల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, స్టాటిస్టికల్ అధికారి నాగ మల్లేశ్వరరావు, సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జి రవీందర్ రెడ్డి, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం

- గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తాం
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

తాండూరు, మే 20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలమని, పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని వికారాబాద్ జిల్లా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(డీసీసీ) అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. ముందుందు కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అనంతరం తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అంటే కుటుంబం వంటిదని, కొత్త, పాత తేడా లేకుండా పార్టీ జెండా కింద పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీపై దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నేతల విష ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కొత్తగా పార్టీ పదవులు ఆశించేవారు దరఖాస్తులను ఇన్‌చార్జిలకు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తాండూరు రోడ్లను బాగు చేయిస్తున్నాని తెలిపారు. గత ప్రభుత్వం తాండూరులో శిలాఫలకాలు వేసి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. అనంతరం పరిశీలకుడు, ఇన్‌చార్జి వినోద్ కుమార్, నరేందర్ రాంశెట్టి మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యుడు రమేష్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ధారాసింగ్, గాజీపూర్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, పీఏసీఎస్ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, డీపీసీ మాజీ సభ్యుడు నర్సింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మశాంతి కలగాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.



మేడ్చల్‌లో తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

# మేడ్చల్‌లో తిరంగా ర్యాలీ

మేడ్చల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను అంతమొందించేంత వరకు ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సైనికులకు మద్దతుగా మేడ్చల్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ మాట్లాడుతూ. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నదన్నారు. పహల్గామ్ ఘటన దురదృష్టకరమని, ఉగ్ర దాడులకు ప్రతీకారంగా ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. పహల్గామ్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా దేశ అభివృద్ధిని అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్ రెడ్డి, నాయకులు శైలజ, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మద్‌నగర్ రెవెన్యూ పరిధి పోరేడోనికుంట నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దెబ్బడగూడ మాజీ సర్పంచ్ డి.జంగయ్య మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మహ్మద్‌నగర్ రెవెన్యూలోని సర్వే నెంబర్ 45లో మట్టి తవ్వకాలను వెంటనే నిలిపి వేయాలని తహసీల్దార్ కె.గోపాల్‌ను కోరారు. ఆయన వెంట గ్రామస్తులు జి.జంగయ్య, జి.నర్సింహ, జి.శ్రీకాంత్, జి.సమ్మయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో ఆనంద్

## రోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

మర్పల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): రోగుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆనంద్ అన్నారు. ఆయన మంగళవారం మర్పల్లి ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకొని రోగులతో మాట్లాడారు. రోగులకు ఏవిధంగా వైద్య సేవలు అందుతున్నాయో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి, వైద్యుడు శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

# 58.88 కిలోల గంజాయి పట్టివేత

- బీదర్‌కు చెందిన ముఠా గుట్టురట్టు ● ఐదుగురు నిందితుల రిమాండ్
- పరారీలో మరో ఇద్దరు ● గంజాయి, కారు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న బీదర్ ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి పెద్దమొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం రంగారెడ్డి డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ వివరాలను వెల్లడించారు. ఒడిశా నుంచి పుణేకు ఐదుగురి ముఠా గుట్టచప్పుడు కాకుండా గంజాయిని రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 9న వాహనాలు తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చి బ్రీజా కారు(కెఎ 39 ఎం 2162)ను అపి తనిఖీ చేశారు. అందులో 29బండిల్స్‌లో 58.88కిలోల ఎండు గంజాయి లభించింది. ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించి కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా శంషేర్‌పూర్‌వాడికి చెందిన గోవింద్ తప్పలే, గజానంద్, పవన్, అకాష్, అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తారోత్ రాహుల్‌లుగా గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.23లక్షల 55వేల200 ఉంటుందని తెలిపారు. ఐదుగురు నిందితులు ఒడిశా రాష్ట్రం, గణపతి జిల్లాకు చెందిన సుమన్ జన్ని వద్ద కిలో గంజాయికి రూ.1900లకు కొనుగోలు చేసి పూణేకు చెందిన అభిషేక్‌కు కిలోగంజాయి రూ.5వేలకు విక్రయించాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో వారు బ్రీజాకారులో భద్రాచలం, సూర్యాపేట పంతంగి టోల్‌గేట్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి పుణే రోడ్డులో వెళ్లాలనుకున్నారు. సోమవారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు ఓఆర్ఆర్ ఘట్‌కేసర్ ఎగ్జిట్ నెంబర్ 9 వద్ద బ్రీజా కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలినట్లు తెలిపారు. గంజాయితో పాటు కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఒడిస్సాకు చెందిన సుమన్ జన్ని పుణేకు చెందిన అభిషేక్‌లను త్వరలో పట్టుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ తెలిపారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి, ఎస్ఐలు సంగీతరెడ్డి, నందిని, సిబ్బందిని ఆయన అభినందించి వారికి రివార్డ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితులు, కారు, గంజాయి ప్యాకెట్లు

## టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

చేవెళ్ల, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు మేడం రామేశ్వర్‌రావు తెలిపారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం టీడీపీ చేవెళ్ల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేయడం జరిగిందని గుర్తుచేశారు. టీడీపీ చేవెళ్ల మండలాధ్యక్షుడిగా లొంక రాములుగౌడ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దండు మాణిక్యం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అశోక్‌గౌడ్, వెంకటస్వామి, కృష్ణ, కార్యదర్శులుగా బాలరాజు, చందు, జంగయ్య, కోశాధికారిగా సాయిలు యాదవ్‌లు ఎంపికయ్యారు. శుభాన్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : నియామక పత్రాలను అందిస్తున్న రామేశ్వర్‌రావు

### తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తేవాలి

మంచాల : తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సీహెచ్ చక్రపాణి పిలుపునిచ్చారు. లింగంపల్లి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మంతు యాదగిరి, ఉపాధ్యక్షుడిగా గడ్డం పుల్లారెడ్డి, దర్శన్, ప్రధాన కార్యదర్శిగా యార మదారి, కోశాధికారిగా బూరుగు శ్రీశైలం, సభ్యులుగా డి.భాగ్యమ్మ, కె.పద్మమ్మ, బత్తుల కొమురమ్మలు ఎన్నికయ్యారు. టీడీపీ మండలాధ్యక్షుడు యార మహేందర్, లక్ష్మణ్‌జీ, కొంగర వెంకట్‌రెడ్డి, వంగాల కృష్ణ, పగడాల ఆనంద్, పెర్క నర్సింహ, పొలమోని మల్లేష్ , మంగళారం రాములు, యాదయ్య, అవుతపురం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


లింగంపల్లి కార్యవర్గాన్ని అభినందిస్తున్న సీహెచ్ చక్రపాణి

## హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడాలి

శంషాబాద్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు కలసికట్టుగా పోరాడి హక్కులను సాధించుకోవాలని రంగారెడ్డి జిల్లా టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సైదులు పిలుపునిచ్చారు. మంగళవారం శంషాబాద్‌లోని పద్మావతిగార్డెన్‌లో కమిటీ సభ్యులు దేవేందర్ అధ్యతక్షన సమావేశం నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకులు గణేశ్, సురేశ్‌కుమార్, చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈనెల 12న మృతి చెందిన ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌రావుకు నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులుగా దేవేందర్, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. షాద్‌నగర్ యూనియన్ నాయకులు నర్సింహారెడ్డి, జర్నలిస్టులు విక్రమ్‌కుమార్, జాన్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులతో జిల్లా కమిటీ నాయకులు

### టీడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ కార్యవర్గం

టీడబ్ల్యూజేఎఫ్ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గోపాల్, బుచ్చన్న, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, నర్సింహాయాదవ్, మాధవచారి, కోషాధికారిగా భానుమూర్తి, సహాయ కార్యదర్శులుగా సతీశ్‌బాబు, యాదగిరి, మద్దూర్ శ్రీనివాస్, సలహాదారులుగా కోళ్ల యాదయ్య, ప్రచార కార్యదర్శిగా జ్ఞానేశ్వర్‌ను ఎన్నుకున్నారు.

## పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

షాద్‌నగర్‌రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్ ఖాన్ కోరారు. బక్రీద్, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఏసీపీ కార్యాలయంలో శాంతిసమావేశం ఏర్పాటు చేశారు. ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రజలు శాంతియుతంగా మెలుగుతారని, మున్ముందు కూడా శాంతియుతంగా నడుచుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబర్‌ఖాన్, హాజరైన ఏసీపీ రంగస్వామి

## 25 లోపు ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలి


ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు, మే 20(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా చేపట్టాలని ఈనెల 25వ తేదీ లోపు గ్రౌండింగ్ పూర్తి చేయాలని కల్వకుర్తి నియోజకవర్గ ఇందిరమ్మ ఇళ్ల స్పెషలాఫీసర్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి ఎంపీడీవోలను ఆదేశించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ఎంపీడీవో లు, ఇందిరమ్మ ఇళ్ల అధికారులతో సీఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, గ్రౌండింగ్ గూర్చి ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో మాధురి, సుజాత, శ్రీకాంత్, వేజన్న, శంకర్‌నాయక్, సురేశ్, ఎంపీవో పాల్గొన్నారు.

## అకడమిక్ రీసెర్చ్‌లో మైలురాయిని దాటిన అనురాగ్

ఘట్‌కేసర్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): అనురాగ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు అకాడమిక్ రీసెర్చ్‌లో కీలకమైన మైలురాయిని విజయవంతంగా పూర్తి చేసుకున్నట్లు యూనివర్సిటీ సీఈవో నీలిమ తెలిపారు. అకడమిక్ రీసెర్చ్‌లో అనురాగ్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్టిఫిషయల్ ఇంటెలిజెన్స్ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి, సీఎస్‌సీ అసిస్టెట్ ప్రొఫెసర్ వినయశ్రీలు ప్రతిష్ఠాత్మక ఎస్సీఐక్యూ1 జర్నల్‌లో అత్యాధునిక పరిశోధన వ్యాసాన్ని విజయవంతంగా ప్రచురించినట్లు ఆమె తెలిపారు. హెల్త్‌కేర్ బేస్డ్‌సైబర్, ఫిజికల్ సిస్టమ్స్‌లో విశ్వసనీయమైన, సురక్షితమైన అనుమతి పొందిన 'బ్లాక్‌చైన్ అసిస్టెడ్ డేటా ట్రాన్స్‌ఫర్ మెకానిజం'అనే శీర్షికతో రూపొందించిన ఈ పరిశోధనాపత్రం బ్లాక్‌చైన్, హెల్త్‌కేర్ వ్యవస్థలపై ముఖ్యభూమిక పోషిస్తుందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, ఆధారిత సైబర్ భౌతిక వ్యవస్థల డేటాబదిలీకి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అత్యుత్తమ పరిశోధనతో యూనివర్సిటీకి పేరు తీసుకొచ్చిన ప్రొఫెసర్లు మల్లికార్జున్‌రెడ్డి, వినయశ్రీలను సీఈవో నీలిమ అభినందించారు.

## కొనసాగుతున్న రేణుకా ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం జాతర కొనసాగుతోంది. రెండో మంగళవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా వేపచీర ధరించి, జ్యోతిని మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జాతరలో ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవోశేఖర్‌గౌడ్‌తోపాటు మాజీ సర్పంచ్ బుడ్డెల్లి సాయిలు అక్కడి ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస్ పూజారి ఆలయ ప్రతినిధి రవి తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తాండూరు చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పోలీసులు సీసీకెమెరాల ద్వారా భక్తుల రాకపోకలను పరిశీలించారు.


కొలువుదీరిన అమ్మవారు, బోనాలతో భక్తులు

# దారి కాచిన మృత్యువు!

(ఐదో పేజీ తరువాయి)

ఇంటివద్ద పరిగిలో విందు నిర్వహించారు. ఈ వేడుకకు చందన్‌వెల్లి నుంచి ప్రైవేటు బస్సులో పరిగికి చేరుకున్నారు. సోమవారం రాత్రి 2గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణమయ్యారు. పరిగి మండలం రంగాపూర్ సమీపంలో ఆగి ఉన్న లారీని పెళ్లివారు ఉన్న టూరిస్టు బస్సు అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న నలుగురు దుర్మరణం చెందారు. 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇదే బస్సులో వధూవరులు ఉన్నప్పటికీ వారు క్షేమంగా ఉన్నారు. గాయపడిన వారిని పరిగి, వికారాబాద్, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. మృతి చెందిన వారిలో షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేష్ (35), సోలిపేట గ్రామానికి చెందిన మంగలి బాలమ్మ(60), చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన మంగలి హేమలత(32), ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన సందీప్(28) ఉన్నారు. మృతుల గ్రామాలైన సీతారాంపూర్, సోలిపేట్, రావులపల్లి, కిషన్ నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయా గ్రామాల్లో రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

### మరో ఇద్దరి మృతితో...

అలాగే షాబాద్ మండలం సోలిపేట గ్రామానికి చెందిన మంగలి బాలమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. బాలమ్మ (65) వరుడికి అమ్మమ్మ అవుతుంది. మృతురాలికి ముగ్గురు కుమారులు, కూతురు ఉంది. చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన హేమలత (32) రోడ్డు ప్రమాంలో దుర్మరణం చెందారు. ఈమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. హేమలత కూతురు మంగలి మోక్షిత (6) తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉంది. మోక్షిత మొయినాబాద్ మండల పరిధిలోని చాలెంజర్స్ స్కూల్‌లో ఫస్ట్ క్లాస్ చదువుతుంది.

### వధూవరులు క్షేమం

ప్రమాదంలో పెళ్లి జంట క్షేమంగా ఉన్నారు. నవ వధువు, వరుడు ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. వధువు మల్లేశ్వరి, వరుడు సంతోష్‌లు స్వల్ప గాయాలు కాగా, పరిగి ఆస్పత్రిలోనే ప్రాథమిక చికిత్సలు చేసుకుని వెళ్లిపోయారు. ట్రావెల్ బస్సులో పెళ్లి జంట ఇద్దరు ముందు భాగంలో కూర్చున్నారు. ప్రమాదం జరిగిన స్థలానికి కిలోమీటర్ దూరం ముందు మీరు వెనుకాలకు వెళ్లండని వారి పెద్దలు సూచించడంతో వారిద్దరూ వెనుకకు వెళ్లి కూర్చున్నారు. దీంతో ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు.




### మృతుల కుటుంబాలకు అండగా ఉంటా : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

పరిగి, వికారాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. సీతారాంపూర్, సోలిపేట గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పలువురు నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు.

### పెళ్లింట విషాదం....

షాబాద్ మండలం చందనవెల్లి గ్రామానికి చెందిన రామస్వామి, మంజుల దంపతుల కొడుకు సతీష్ కుమార్ పెళ్లి విందులో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రమాదంలో మృతిచెందిన నలుగురు వరుడి దగ్గరి బంధువులే. మృతుల్లో ముత్యాల మల్లేశ్ వరుడికి సొంత బావ. హేమలత చిన్నమ్మ, బాలమ్మ అమ్మమ్మ, మంగలి సందీప్ మేనబావ అవుతారు. ఈ నలుగురు వేర్వేరు గ్రామానికి చెందినవారు.

### అమ్మ మృతి.. ఆస్పత్రిలో బిడ్డకు సీరియస్

రంగాపూర్ దగ్గర జరిగిన ప్రమాదంలో కన్నతల్లి మృతి చెందగా, బిడ్డ అస్పత్రిలో చికిత్స పొందుతున్నది. చేవెళ్ల మండలం రావులపల్లి గ్రామానికి చెందిన మంగలి హేమలత, కుతూరు మోక్షిత పరిగిలోని విందుకు వచ్చారు. ఈ ప్రమాదంలో హేమలత అక్కడికక్కడే మృతి చెందింది. మోక్షిత తలకు తీవ్ర గాయాలు కావడంతో నిలోఫర్‌లో చికిత్స పొందుతుంది. మోక్షితకు తల్లి మృతి చెందిన విషయం తెలియదు. మోక్షిత పరిస్థితి కూడా విషమంగా ఉందని చెబుతున్నారు. దీంతో రావులపల్లి గ్రామంలో విషాదం అలుముకుంది.

### పోలీసుల సేవలు భేష్

పరిగి మండలం రంగాపూర్ వద్ద మంగళవారం అర్థరాత్రి, తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతులు, క్షతగాత్రులకు పోలీసులు అందించిన సేవలకు స్థానికులు అభినందనలు తెలిపారు. అర్థరాత్రి ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల ఎస్‌ఐలు ఎం.సంతోష్, మధుసూదన్‌రెడ్డి, రమేశ్,ఆనంద్‌కుమార్‌లు,తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సులో ఇరుక్కుపోయినవారిని బయటకు తీశారు. వాహనం ఇనుప రాడ్ల మధ్య ఇరుకుపోయిన నలుగురి మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారు ఇరుక్కుపోయి ఉండి కేకలు, రోదిస్తుండగా జేసీబీ ఇతర యంత్రాల సహాయంతో సురక్షితంగా బయటకు తీశారు. ఆరేళ్ల మోక్షిత ఇనుప చువ్వల కింద ఇరుక్కోవడంతో నిదానంగా బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంలో పోలీసుల సేవలను కొనియాడారు.

### ట్రావెలర్ నిర్లక్ష్య వైఖరి వల్లే ప్రమాదానికి కారణం?

ట్రావెలర్ నిర్లక్ష్య వైఖరి వల్లనే ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ ట్రావెలర్ నిర్వహిస్తుంటాడు. వరుడు స్వగ్రామమైన చందనవెల్లి నుంచి కుటుంబసభ్యులు, బంధువులు కలిసి ట్రావెలర్ బస్సును మాట్లాడుకొని 45 మందితో కలిసి పరిగిలో జరిగిన విందుకు తీసుకొచ్చారు. అయితే శ్రీకాంత్ ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సు కొందర్గులోని ఫంక్షన్‌కు వచ్చి రిపేర్ వచ్చింది. పరిగికి వచ్చిన బస్సును కొందర్గులోని సదరు ట్రావెల్ బస్సులోని వారిని నాగర్‌కుంటకు తీసుకెళ్లమని ట్రావెల్ యజమాని, పరిగికి వచ్చిన డ్రైవర్ ఎండీ యూసుఫ్ సూచించారు. దీంతో యూసుఫ్ ఇక్కడికి వచ్చిన వారికి నేను కొందర్గుకు వెళ్లి వస్తాను, అప్పటి వరకు వేచి ఉండాలని చెప్పిన కొందర్గుకు వెళ్లారు. కొందర్గులోని వారిని నాగర్‌కుంటకు తరలించిన తర్వాత అర్థరాత్రి 1.30 గంటలకు ట్రావెల్ బస్సును పరిగికి తీసుకొచ్చాడు. పదిన్నర గంటలకు పరిగిలో విందు ముగించుకొని బస్సు కోసం వేచివేచి కొందరు నిద్రకు కూడా ఉపక్రమించారు. డ్రైవర్ ఒకటిన్నర ప్రాంతంలో అందరినీ లేపి ట్రావెల్స్ బస్సులో ఎక్కించుకుని చందనవెల్లి వెళ్లేందుకు బయలు దేరాడు. పరిగి నుంచి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉన్న రంగాపూర్ దగ్గర రోడ్డు పక్కనే నిలిచి ఉన్న లారీని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 20మందికిపైగా గాయపడ్డారు. ట్రావెల్స్ బస్సును కొందుర్గుకు తీసుకెళ్లకుంటే ఈ ప్రమాదం జరిగేది కాదని బంధువులు ఆరోపించారు. కొందర్గుకు వెళ్లకుంటే పరిగిలో 11గంటలలోపే విందును ముగించుకుని తిరిగి రాత్రి 12లోపు స్వగ్రామానికి వెళ్లేవారమని చెబుతున్నారు. ట్రావెలర్ యజమాని వైఖరి వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు కూడా చెబుతున్నారు. బస్సు కొందర్గుకు వెళ్లకుంటే పరిగిలో విందును త్వరగా ముగించి సురక్షితంగా వెళ్లేవారమని గాయపడిన వారి బంధువులు తెలిపారు.

### రోడ్డు పక్కనే లారీని ఎందుకు ఆపారు.?

ట్రావెల్ బస్సు ప్రమాదానికి కారణమైన లారీ రోడ్డు పక్కనే ఎందుకు నిలిపి ఉంచారన్నది ప్రశ్నార్థకంగా మారింది. పరిగి మండలం శల్మజాల తండాకు చెందిన లారీలో నిత్యం కర్ణాటకలోని సేడం నుంచి హైదరాబాద్‌కు సిమెంట్‌ను రవాణా చేస్తుంటారు. సోమవారం అర్థరాత్రి కూడా సిమెంట్ బస్తాలను పరిగి మీదుగా నగరానికి వెళుతున్నది. లారీని రంగాపూర్ శివారులో రోడ్డు పక్కన ఎందుకు నిలిపి ఉంచారన్నది తెలియడం లేదు. ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ రోడ్డు పక్కనే నిలిపి ఉంచలేదని, లైవ్‌లో వెళుతున్న క్రమంలో వెనుకాల నుంచి ట్రావెల్ బస్సు ఢీకొట్టిందని మరికొందరు వాదిస్తున్నారు. లారీ రోడ్డుపై ఎందుకు ఆగి ఉండడాన్ని పోలీసులు తమ విచారణలో తేల్చాల్సి ఉంది.

## రోడ్లు రక్తసిక్తం

- అతివేగంతో గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- జనవరి నుంచి ఇప్పటివరకు 59 ప్రమాదాలు
- 33 మంది మృతి, 150మందికిపైగా క్షతగాత్రులు

పరిగి, మే 20 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగం.. అస్తవ్యస్త రహదారులు.. ఆపై మద్యం సేవించి నడిపించడం.. వచ్చిరాని డ్రైవింగ్.. సామర్థ్యానికి మంచి ప్రయాణం మూలంగా రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పరిగి సబ్ డివిజన్ పరిధిలో ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. ఈ రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నారు. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు అంగడిచిట్టెంపల్లి నుంచి రావులపల్లి వరకు జరిగిన 59 రోడ్డు ప్రమాదాల్లో 33 మంది మృతి చెందగా 150 మందికిపైగా క్షతగాత్రులయ్యారు. మంగళవారం పరిగి మండలం రంగాపూర్ వద్ద లారీని పెళ్లి బస్సు ఢీకొట్టిన ఘటనలో నలుగురు మృతి చెందగా, 31 మందికిపైగా గాయాలైన ఘటన అందరినీ కలచివేస్తోంది.

### అడ్డగోలుగా పార్కింగ్‌లతో ప్రమాదాలు



రోడ్లకు ఇరువైపులా ఎక్కడబడితే అక్కడే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మన్నెగూడ చౌరస్తా, వికారాబాద్, పరిగి, హైదారాబాద్ రూట్లలో లారీలను ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారు. చీకటిపడగానే రోడ్లకు పక్కన ఆపుతున్నారు. పరిగి పట్టణంలో రోడ్ల పక్కన లారీలను నిలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మన్నెగూడ నుంచి కొడంగల్ వరకు మన్నెగూడ, రంగాపూర్-సోమన్‌గుర్తి, రూప్‌ఖాన్‌పేట్, చింతలచెరువు, తుంకిమెట్ల, రావులపల్లి, పరిగి - షాద్‌నగర్ రహదారిలో రంగాలక్ష్మీదేవిపల్లి గేట్ దగ్గర ఉన్న సుగుణ స్టీల్ ఫ్యాక్టర్ దగ్గర భారీ వాహనాలు నిలుపడంతో వాహనదారులకు ఇబ్బందికంగా మారింది. ఈ రూట్‌లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుర్తించి రోడ్డుపై వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

### హైవేపై పెట్రోలింగ్ ఎక్కడ?

**ఆందోళన కల్గిస్తున్న రోడ్డు ప్రమాదాలు**




హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై పోలీస్ పెట్రోలింగ్ 24 గంటలపాటు నిర్వహించడం లేదు. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై రెండు పెట్రోలింగ్ స్టేషన్‌లు ఉన్నప్పటికీ అంతంతమాత్రమే పెట్రోలింగ్ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం అంగడిచిట్టెంపల్లి నుంచి కొడంగల్ మండలం రావులపల్లి వరకు జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారిపై మన్నెగూడ, కొడంగల్‌లలో హైవే పెట్రోలింగ్ స్టేషన్లను ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన సమయంలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించారు. ఆ తర్వాత ఒక ఎస్ఐ, నలుగురు సిబ్బందికి కుదించారు. ఒక్కోసారి ఇద్దరే విధులు నిర్వహిస్తుంటారు. సిబ్బంది అరకొరగా ఉంటే నిరంతర నిఘా, పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుందని పోలీస్ ఉద్యోగులే అంటున్నారు. మన్నెగూడ పెట్రోలింగ్ స్టేషన్ అంగడిచిట్టెంపల్లి నుంచి గడిసింగాపూర్ వరకు, కొడంగల్ స్టేషన్ గడిసింగాపూర్ నుంచి రావులపల్లి వరకు పెట్రోలింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే రాత్రిపూట అసలే పెట్రోలింగ్ నిర్వహించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

## శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా నిర్వహించి పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రత, అక్రమ రవాణా వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసులపై త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గుట్కా, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలకు శ్రీకారం చుట్టామని, పీడీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రకు ప్రత్యేక బలగాలను మోహరించి, షీటీమ్స్ పనితీరును మరింత మెరుగు పర్చాలన్నారు. బక్రీద్ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ టీవీ హన్మంత్ రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



## అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

తలకొండపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. దేశభక్తి గీతాలకు విద్యార్థులు వివిధ వేషధారణతో చేసిన నృత్యాలు అమితంగా ఆకట్టుకున్నాయి. శృతిలయ కల్చర్ అకాడమీ ఆధ్వర్యంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, వందేమాతరం ఫౌండేషన్ సహకారంతో ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాల ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్మ మాధవ రెడ్డి, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శృతిలయ కల్చర్ అకాడయీ చైర్మన్ చిత్తరంజన్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక, బోనాల, దేవతామూర్తుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాము, నర్సింహ, విజయ్‌కుమార్, నాయకులు ఉన్నారు.

## సీఎస్‌ఆర్ నిధులతో బీసీ రెసిడెన్షియల్ ఏర్పాటు

**ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ఆమనగల్లులో పాత బీసీ వసతి గృహ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, మే20(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో సీఎస్‌ఆర్ నిధులతో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయిస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. ఆమనగల్లులోని మాడ్గుల రోడ్డులో వసతిగృహం ఎత్తివేయడంతో నిరుపయోగంగా శిథిలావస్థకు చేరుకున్న బీసీ బాలుర వసతి గృహ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురామ్, తహసీల్దార్ లలితలతో కలిసి ఎంపీ పరిశీలించారు. పిల్లలు లేరన్న సాకుతో వసతి గృహాన్ని ఎత్తివేసి భవనాన్ని వృథాగా వదిలివేయడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనం చుట్టూ ఉన్న చెత్త చెదారాన్ని తొలగించాలని అధికారులకు ఆదేశించారు. వసతి గృహం స్థానంలో సీఎస్‌ఆర్ నిధుల ద్వారా బీసీ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ స్కూల్ ప్రభుత్వ పరంగా మంజూరు చేయించి సీఎస్‌ఆర్ నిధులు రూ.5 కోట్లతో అధునాతన భవనాలు నిర్మిస్తామని చెప్పారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన భూ వివాదాన్ని పరిష్కరించి అసంపూర్తి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని మల్లు రవి తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, ఆమనగల్లు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, పీసీసీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు బాబా, నాయకులు శ్రీను నాయక్, మహేశ్ పాల్గొన్నారు

## రైతులకు అందిస్తున్న సేవలు భేష్

- ఇండోనేషియా వ్యవసాయ శాఖ అధికారుల కితాబు



చేగూర్ పీఏసీఎస్ వద్ద ఇండోనేషియా వ్యవసాయశాఖ అధికారులు

నందిగామ, మే 20(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలపరిధిలోని చేగుర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఇండోనేషియా వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. వ్యవసాయ రంగంలో ఎరువులు, విత్తనాల సరఫరా విధానంపై వారు అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా రైతు భరోసా, రైతు బీమా, పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా, రికార్డుల నిర్వహణ, ఆధార్ ఆధారిత పంపిణీ విధానంపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎరువుల సరఫరా విధానంలో పారదర్శకత, సమర్థత కోసం 60 శాతం పీఏసీఎస్‌ల ద్వారా, 40 శాతం ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వారికి వివరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ నిర్వహణను అభినందిస్తూ.. రైతులకు అందిస్తున్న సేవలు ప్రేరణాత్మకంగా ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో ఇండోనేషియా అభివృద్ధి ప్రణాళిక మంత్రిత్వశాఖ ప్రధానాధికారి బాపక్ లియోనార్డో, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహ్మారావు, ఏడీ నిషాంత్‌కుమార్ అధికారులు మాధవి, సత్యంబాబు, రాంశివరావు, కవిత, రవి, తేజ్‌కుమార్, వెంకటయ్య, ఇండోనేషియా అధికారుల బృందం పాల్గొన్నారు.

### శంషాబాద్‌లో ఫర్టిలైజర్ షాపుల సందర్శన

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఇండోనేషియా బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా తెలంగాణలో రైతులకు విత్తనాలు ఎలా సరఫరా అవుతున్నాయనే విషయాన్ని తెలుసుకున్నారు.

## రూ.594 కోట్లతో రోడ్ల అభివృద్ధి

- పీఆర్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి



కాంట్రాక్టర్లు, అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి

కొడంగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అభివృద్ధి పనులను నాణ్యతగా, త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లకు పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ రోడ్ల అభివృద్ధికి మంజూరైన రూ.594 కోట్లతో రోడ్డు పనులకు సంబంధించి మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో ఈఈ సత్య నారాయణరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ అభివృద్ధికి నిధులు మంజూరవుతున్నా పనుల్లో జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించారు. కడా పరిధిలో మంజూరైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఆర్ నిధులతో 18 అభివృద్ధి పనులకు రూ.కోటీ 30 లక్షలు, ఎస్‌డీఎఫ్ కింద 112 పనులకు రూ.434 కోట్లు మంజూరు కాగా, కడా కింద 870 పనులకు రూ.30 కోట్లతో పనులు సాగుతున్నట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో డీఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ‘ధరణి’తో దగాపడ్డాం.. న్యాయం చేయండి

**రెవెన్యూ సదస్సులో అధికారులను వేడుకున్న దళిత రైతులు**



రెవెన్యూ సదస్సులో భూ సమస్యను అధికారులకు వివరిస్తున్న దళిత రైతు చంద్రయ్య

ధారూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ‘ధరణి’తో పాసుపుస్తకాలు రాక దగాపడ్డామని, భూ భారతిలోనైనా తమకు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని రెవెన్యూ సదస్సులో దళిత రైతులు అధికారులను వేడుకున్నారు. ధారూరు జిల్లాపరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ధారూరులోని సర్వేనంబరు 104లో ప్రభుత్వం ఇచ్చిన భూములకు సంబంధించిన సమస్యను రైతులు సదస్సులో అధికారులకు వివరించారు. ఈ భూముల విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని ధరణిలో తమకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదని వారు చెప్పారు. ఈ సర్వే నంబరులో 18మంది దళితులకు 15.20గుంటల భూమి ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. ఈ భూమిలో పూర్వ కాలం నుంచి కబ్జాలో తక్కువ ఉన్నా ఎక్కువ, ఎక్కువ కబ్జాలో ఉన్నా తక్కువ కబ్జాలో ఉన్నట్లు రికార్డుల్లో నమోదు చేశారని చంద్రయ్య అనే రైతు వివరించారు. దీని కారణంగా ధరణిలో కొత్త పాసుపుస్తకాలు రాలేదని ఆయన చెప్పారు. దీని కారణంగా తమకు రైతు భరోసా, పీఎం కిసాన్ డబ్బులు రాక, బ్యాంకుల్లో రుణాలు ఇవ్వక రైతు రుణమాఫీ కోల్పోయామని వాపోయాడు. అదేవిధంగా మృతిచెందిన రైతులకు రైతు బీమా అందలేదని, వారి వారసులకు విరాసత్‌లు కాలేదని ఆయన అధికారులకు వివరించారు. తాము సాగులో ఉన్న భూమికైనా లేనిపక్షంలో సర్వే నిర్వహించి ఎవరెవరు ఎంతసాగులో ఉంటే అంత భూమికి కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ దళిత రైతులు దరఖాస్తు అందజేశారు. కాగా ఈసమస్యను ప్రత్యేకంగా పరిశీలించి సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ సాజిదాబేగం వారికి హామీ ఇచ్చారు. కాగా వ్యవసాయ భూముల్లో ఇళ్లులేకున్నా ధరణిలో నేచర్‌ఆఫ్ ల్యాండ్ కాలమ్‌లో హౌజెస్(ఇళ్లు) అని పొరపాటుగా నమోదు చేయటంతో చాలాకాలంగా మ్యుటేషన్లు ఆగిపోయాయని, పాసుపుస్తకాలు రాలేదని సమస్యనుపరిష్కరించాలని రైతులు కోరారు.

## రైతులకు అన్యాయం జరగనివ్వం

- రావిర్యాలలో నిర్వహించిన గ్రామ సభలో కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

మహేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాల కొంగర ఖుర్దు(ఎ)లో భూములు కోల్పోతున్న ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగనివ్వమని, ప్రజలు, రైతుల అభిప్రాయం మేరకే అధికారులు విధులు నిర్వహిస్తారని, పరిహారం విషయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వ నిర్ణయం మేరకు అందిస్తామని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. కొంగర ఖుర్దు(ఎ) లోని సర్వే నెంబర్ 289లో గల 277ఎకరాల అసైన్డ్ భూముల్లో ఎలక్ట్రానిక్ పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రకటన చేయడంతో భూ సేకరణ పరిహారం, పునరావాస, ఉపాధి కల్పనకు సంబంధించి తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల వార్డు కార్యాలయంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ నిర్వహిస్తుండగా కొందరు రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 140 మంది రైతులకు సంబంధించి 277 ఎకరాల ఎకరాల భూమిని కోల్పోతున్నామని.. ఈ భూములను తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వ తీసుకుంటే మా గతేంటని పలువురు రైతులు అధికారులను ప్రశ్నించారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ప్రతీ రైతుకు వెయ్యి గజాల స్థలంతో పాటు పరిహారం కూడా అందజేయాలని, మార్కెట్ ధర చెల్లించాలని, లేనిపక్షంలో భూములను ఇవ్వబోమని అధికారులకు తేల్చి చెప్పడంతో పాటు లిఖిత పూర్వక దరఖాస్తులు అందజేశారు. దాంతో ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులుగా మీరు డిమాండ్ చేయడం సబబే అయినప్పటికీ.. మీ ప్రతిపాదనలను అధికారులుగా మేము నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపి ప్రతీ రైతుకూ న్యాయం జరిగేలా చేస్తామన్నారు. అదేవిధంగా జీవనోపాధి కోల్పోయిన వారికి ప్యాకేజీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పునరావాసం కల్పించి ఉపాధి కూడా చూపుతుందన్నారు. మార్కెట్ ధరకు మూడు రెట్లు పరిహారం ఇచ్చి రైతులను అన్నివిధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని భూ సర్వేకు సహకరించాలని ఆర్డీవో కోరారు. మహేశ్వరం తహసీల్దార్ సైదులు, రావిర్యాల రైతులు పాల్గొన్నారు.

# ముగిసిన రెవెన్యూ సదస్సులు


ధారూరు రెవెన్యూ సదస్సులో దరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం ముగిశాయి. మండల వ్యాప్తంగా 34 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 5నుంచి అధికారులు రెవెన్యూ సదస్సులు చేపట్టారు. ఈ సదస్సుల్లో మొత్తం 579దరఖాస్తులు అందగా, చివరిరోజు 102 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ధారూరులో సక్సెషన్ 9 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్ 18, మిస్సింగ్ సర్వేనంబర్లకు 10, పెండింగ్ మ్యూటేషన్‌కు 5, నేచర్ ఆఫ్ ల్యాండ్‌కు 1, పేరు మార్పు 1, పీవోబీకి 1 దరఖాస్తు అందాయి. రాంపూర్‌లో డీఎస్ పెండింగ్ 1, ఇతర 41 దరఖాస్తులు, గట్టేపల్లిలో మిస్సింగ్ సర్వేకు 3, చేంజ్ ఆఫ్ ల్యాండ్ నేచర్‌కు 1, సక్సెషన్‌కు 6, డీఎస్ పెండింగ్ 1, కులం మార్పుకు 1, ఇంటి పేరు, పేరు మార్పుకు 1, భూవిస్తీర్ణం సవరణకు 1 దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు. కాగా ధారూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పాల్గొని రైతుల నుంచి అందిన దరఖాస్తులను పరిశీలించి వారితో మాట్లాడారు. భూభారతి చట్టానికి అనుగుణంగా రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సాజిదాబేగం, శ్రీనివాస్, దీపక్, శ్యామ్‌సన్, డీటీ విజయేందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సదస్సుల్లో గ్రామాల వారీగా అందిన దరఖాస్తులు

బాచారంలో 16, అవుసుపల్లిలో 12, కాచారంలో 10, అంపల్లిలో 14, అల్లాపూర్‌లో 17, అల్లీపూర్‌లో 7, గడ్డమీదిగంగారంలో 24, నర్సాపూర్‌లో 12, ధర్మాపూర్‌లో 17, కొండాపూర్‌కలాన్‌లో 11, ఎబ్బనూర్‌లో 17, హరిదాసుపల్లిలో 15, చింతకుంటలో 11, దోర్నాల్‌లో 9, కుమ్మరిపల్లిలో 9, గురుదొట్లలో 17, మున్నూర్‌సోమారంలో 3, కేరెల్లిలో 4, కుక్కిందలో 14, మోమిన్‌కలాన్‌లో 22, అంతారంలో 6, మోమిన్‌ఖుర్దులో 31, నాగారంలో 24, రాజాపూర్‌లో 25, కొండాపూర్‌ఖుర్దులో 9, తరిగోపులలో 63, మైలారంలో 8, నాగసానిపల్లిలో 3, నాగసముందర్‌లో 36, బుర్రుగడ్డలో 2, రుద్రారంలో 9, ధారూరులో 46, గట్టేపల్లిలో 14, రాంపూర్‌లో 42 దరఖాస్తులు అందాయి.

# నిలిచిన ధాన్యం తూకాలు

- కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత
- లారీలు రాక కొనుగోళ్లు ఆలస్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు


తూకం వేయకపోవడంతో కేంద్రంలో ధాన్యం రాశులు

బొంరాస్‌పేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం నుంచి గన్నీ బ్యాగుల కొరతతో తరచూ ధాన్యం తూకాలు నిలిచిపోతున్నాయి. దీనికి తోడు లారీల కొరత కూడా ఉండటంతో ధాన్యం కొనుగోళ్ల ఆలస్యం అవుతోంది. ఫలితంగా అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కింద కురిసిన వర్షానికి రైతుల ధాన్యం రాశులతో పాటు తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. వేసవి కాలం అయినా ఆకలు వస్తుందని కుండపోతగా కురిసిన వాన కేంద్రానికి మూడు లారీలు పంపించారు. శుక్ర, శని, ఆదివారాల్లో లారీలు రాకపోవడంతో తూకంవేసిన బస్తాలు సైతం తడిసిపోయాయి. గన్నీ బ్యాగుల కొరత ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 7వేల బస్తాలు పంపిందని అధికారులు చేతులు దులుపుకున్నారు. అందులో ఇప్పటికే 5వేలకు పైగా తూకం వేసి పంపించినా 2వేల బస్తాలు కేంద్రంలో తూకంవేసి నిల్వ ఉంచారు. మంగళవారం మళ్లీ బస్తాలు లేకపోవడంతో తూకాలు నిలిచిపోయాయి. సోమవారం సాయంత్రం వచ్చిన ఒలారీలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిర్వాహకులు పంపించారు. ఈ కేంద్రంలో తూకం, లారీలో లోడింగ్ జరగలేదు. గన్నీబ్యాగులు లేకపోవడంతో హమాలీలు సైతం పనిలేక ఖాళీగా కూర్చున్నారు. మరో పది వేల బస్తాలు పంపిస్తే కానీ కేంద్రంలో కొనుగోలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు.


తడిసిన ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న రైతులు

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి రికార్డు స్థాయిలో ధాన్యం వచ్చింది. ఇప్పటికే 20వేల ధాన్యం బస్తాలు తూకంవేసి పంపించినా మరో 10వేల బస్తాల వరకు ధాన్యం నిల్వలు ఉన్నాయి. అధికారులు సకాలంలో రైతులకు గన్నీ బ్యాగులు అందిస్తే జానకంపల్లి, మహంతీపూర్, దుప్చర్ల గ్రామాలకు చెందిన రైతులు వరిధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంది. గన్నీ బ్యాగుల కొరత కారణంగా పలువు సరిగా కొనసాగక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గన్నీ బ్యాగులు కేంద్రానికి పంపించాలని రైతులు కోరుతున్నారు.

## క్రైం కార్నర్

### హత్యకు పాల్పడిన నిందితుడి రిమాండ్


నిందితుడు శంకర్

మేడ్చల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలో నడిరోడ్డుపై దారుణంగా వ్యక్తిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టుచేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం తన సమీప బంధువు మోతీలాల్ అనే వ్యక్తిని కత్తితో పొడిచి దారుణంగా హతమార్చి అక్కడ నుంచి పరారైన శంకర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మోతీలాల్ జరిగిన గొడవ గురించి తన తల్లికి చెబుతానని బెదిరించడంతో ఆవేశంతో శంకర్ ఈ హత్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే నిందితుడి ఆచూకీ కనిపెట్టిన పోలీసులు చాకచక్యంగా శంకర్‌ను అదుపులో తీసుకున్నట్లు సీఐ సత్యనారాయణ వివరించారు.

## పూర్తిస్థాయి పరిహారం అందించాలి


రిలే నిరాహార దీక్షతో నిరసన తెలుపుతున్న రైతులు

కొడంగల్, మే 20 (ఆంధ్రజ్యోతి): అప్పాయిపల్లి గ్రామశివారులోని సర్వేనెంబర్ 19లో ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం భూములు ఇచ్చిన పలువురు రైతులకు పూర్తిస్థాయి పరిహారం అందలేదని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎదన్‌పల్లి శ్రీనివాస్ అన్నారు. బాధిత రైతులు మల్లేశ్, ఆశమ్మ, బసప్ప, అమృతప్ప, శేఖర్‌లతో కలిసి మంగళవారం నిరసన తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వ హామీ మేరకు పూర్తిస్థాయి పరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నర్సప్ప, రాములుగౌడ్, సావిత్రమ్మ, శ్రీశైలం పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

కీసర, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ శ్రీదేవి అన్నారు. కీసరలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నుంచి శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు విచ్చేసి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ మేరకు ప్రొఫెసర్ శ్రీదేవి మాట్లాడుతూ.. రైతులు తమ వ్యవసాయ పొలాల గట్ల వద్ద శ్రీగంధం, టేకు, వెదురు, గ్లెరిసిడియా మొక్కలను నాటడం వల్ల వేడి, ఈదురుగాలుల నుంచి పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. కలవ విక్రయంతోనూ లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు విక్రమ్, సందీప్, మండల వ్యవసాయశాఖ అధికారి మాధవీలత, రైతులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ మండల కమిటీ

చౌదాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మండల నూతన కమిటీని మంగళవారం పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కులకచర్ల మండల కమిటీకి అధ్యక్షుడిగా ఉమ్మడి మండల అధ్యక్షుడిగా పాండు, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా కల్యాణ్‌కుమార్, కోశాధికారిగా నర్సింహులు, కార్యదర్శిగా కుమార్, సంయుక్త కార్యదర్శిగా రాజేశ్, కార్యవర్గసభ్యులుగా చంద్రశేఖర్, విశ్వేంద్రచారి, శ్రీనయ్య తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రమేశ్, విజయ్, వినోద్ పాల్గొన్నారు.

# ఇక అన్ని గ్రామాల్లో 'భూ భారతి'

(ఐదో పేజీ తరువాయి)

పైలెట్ ప్రాజెక్టు మండలం కీసర మినహా మిగిలిన 14 మండలాల్లో సదస్సులు నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

## సమస్యలను విభజించి పరిష్కారం

భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా కీసర మండలంలో వచ్చిన దరఖాస్తులను అధికారులు విభజించి పరిష్కరించేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. జూన్ 2వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు చేపట్టనున్నందున అప్పటివరకు పైలెట్ ప్రాజెక్టు కీసరలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సమస్యల ప్రాతిపదికన బృందాలను ఏర్పాటుచేసి భూసమస్యలను పరిష్కరించేదుకు కృషి చేస్తున్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించడానికి సమస్యలను ఎంపికచేసే ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉండటంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నారు.

## శుభకార్యానికి ప్రముఖుల హాజరు


శుభకార్యంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీజీకే ఫంక్షన్ హాల్‌లో మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ సంగీత దంపతుల కుమారులైన విశ్వజిత్‌గౌడ్, వర్షిత్‌గౌడ్ ఫుట్టువంచిన కార్యక్రమంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పాల్గొన్నారు. చిన్నారులతో వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్, ధారూర్, మర్పల్లి, కోట్‌పల్లి, మోమిన్‌పేట్ మండలాల ప్రజాప్రతినిధులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.నర్సింహారెడ్డి, మోమిన్‌పేట్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దబ్బూని వెంకట్, సొసైటీ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, ధారూర్ మండల అధ్యక్షుడు దాతారి శ్రీనివాస్‌రెడ్డి, మర్పల్లి మాజీ జడ్పీటీసీ మధుకర్, బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, వెంకటేశం పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి


తాండూరు రూరల్: అంతారం రైతు వేదికలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి కొమురయ్య

తాండూరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకుని విత్తుకోవాలని తాండూరు మండల వ్యవసాయాధికారి కొమురయ్య సూచించారు. తాండూరు మండలం అంతారం రైతు వేదికలో విత్తనాల కొనుగోలు, ఎంపికపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ లైసెన్స్ గల డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయాలని, బిల్లు తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేని వ్యాపారుల నుంచి కానీ, గ్రామాలలో తిరుగుతూ విత్తనాలు విక్రయించే వారి వద్ద విత్తనాలు కొనవద్దని, అలా గ్రామాల్లో వచ్చి విత్తనాలు అమ్మితే వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రధానంగా పత్తి విత్తనాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## రైతులు నిపుణుల సలహాలు పాటించాలి

మేడ్చల్ టౌన్: రైతులు వ్యవసాయ నిపుణుల సలహాలు సూచనలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. సోమారం గ్రామంలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతుసదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, ఏఈవో తేజస్విని తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: రైతు సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

# ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలి

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


తాండూరు: ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా ఉపాధ్యాయులు పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. తాండూరు పట్టణం ప్రభుత్వ నంబర్‌వన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల శిక్షణ కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్య, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ బాలేశ్వర్‌గుప్తా, ఉపాధ్యాయులు బాలారం జైపాల్‌రెడ్డి, రామ్, నర్సింహారెడ్డి, నర్సిరెడ్డి, జొన్నల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

**తాండూరు రూరల్:** తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం పెంచాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై తరగతులను ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పెద్దేముల్ మండల సీనియర్ నాయకులు ధారాసింగ్, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాలిరెడ్డి, ఎంఈవో వెంకటయ్య పాల్గొన్నారు.

## 'మాటిచ్చాం.. నిలబెట్టుకుంటాం'

**యాలాల:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆయన యాలాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాలిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, భీమప్ప, అక్బర్ బాబా, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో పుష్పలీల పాల్గొన్నారు.

# గుణాత్మక విద్యనందించాలి


చౌడాపూర్: మాట్లాడుతున్న ఎంఈవో రాంచందర్

పరిగి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని ఎంఈవో గోపాల్ అన్నారు. విద్యార్థుల ప్రగతి సామర్థ్యాల పెంపునకు మంగళవారం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణ తరగతులను హాజరై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. తెలుగు, గణితం, ఇంగ్లీష్, పరిసరాల విజ్ఞానం, పాఠశాలల నిర్వహణ అంశాలపై తమ పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్ ఎండీ ఉస్మాన్ అలీ, వీణవెంకటప్రసాద్, నరేందర్‌రెడ్డి, లక్ష్మయ్య ప్రసాద్, స్వప్న, రమేశ్ పాల్గొన్నారు.

**చౌడాపూర్:** మండల కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణలో ఎంఈవో రాంచందర్ పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్, బోధన అభ్యసన ప్రక్రియపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

**దోమ:** మండల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈవో వెంకట్ ఆధ్వర్యంలో స్థానిక కేజీబీవీ పాఠశాలలో శిక్షణ ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఉదయం 9గంటలకు శిక్షణకు హాజరుకావాలని, ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. డీఆర్పీలతో శిక్షణ ఇవ్వనున్నట్లు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**కులకచర్ల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 5 రోజుల పాటు ఉపాధ్యాయులకు వైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో హబీబ్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు బోధన విధానంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

**మోమిన్‌పేట్:** ఐదు రోజుల వృత్యంతర శిక్షణలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. విద్యార్థుల ప్రాథమిక స్థాయిలో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. ఐదు రోజులపాటు కొనసాగే శిక్షణకు ఉపాధ్యాయులు హాజరు కావాలని తెలిపారు.

**బొంరాస్‌పేట్:** మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ఎంఈవో హరిలాల్ ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు.


మోమిన్‌పేట్: మాట్లాడుతున్న ఎంఈవో మల్లేశం

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు


సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, మే 20 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు కలుగుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లికి చెందిన ముజామిల్ అహ్మద్‌కు మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బండారి జగన్మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సభ్యుడు అక్రం అలీ, నజీర్ ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణం చేపట్టాలి

యాలాల, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణం చేపట్టాలని కేవీపీఎస్ నాయకులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండలంలో మంగళవారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను కేవీపీఎస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకులు ఉప్పలి మల్లయ్య మాట్లాడుతూ గతప్రభుత్వం యాలాల మండలానికి రూ.50లక్షల నిధులు అంబేద్కర్ భవన నిర్మాణానికి మంజూరు చేసినట్లు తెలిపారు. శిలాఫలకం వేసినప్పటికీ పనులు మాత్రం చేపట్టలేదని ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే అంబేద్కర్ భవన నిర్మాణ పనులు చేపట్టేలా కృషిచేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ అతిత్వరలో అంబేద్కర్ భవన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవదాసు ప్రవీణ్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## పెట్రోల్ పంపు ఏర్పాటుకు స్థల పరిశీలన

పరిగి, మే 20 (ఆంధ్రజ్యోతి): పరిగి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ పంపు ఏర్పాటుకు మండలంలోని నస్కల్ గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం డీఆర్‌డీవో శ్రీనివాస్, పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావులు సందర్శించారు. పెట్రోల్ పంపు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించామని, ఈ విషయాన్ని నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామని డీఆర్‌డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ దివ్య, సీసీ రాంచంద్రయ్య, నస్కల్ గ్రామ నాయకులు అశోక్, వెంకటయ్య, శ్రీనివాస్, గ్రామ సంఘం అధ్యక్షురాలు రేణుక పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. ఆ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మేడ్చల్‌కు చెందిన ఏసూరి వెంకటేశ్వరరావు, భాగ్య దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, రాజీవ్‌రహదారిపై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి


పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పరిగి, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణలు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరిగిలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. కేంద్రకార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘాల ఆధ్వర్యంలో మే 20న నిర్వహించాల్సిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెన ర్షమ్మ, ఆశావర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి కె.మంగమ్మ, మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు అలీ, నాయకులు రాములు, బాలయ్య, స్వరూప, మంజుల, పద్మమ్మ పాల్గొన్నారు.

**తాండూరు:** సీఐటీయూ తాండూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డొడ్డి కొమురయ్య పార్క్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్స్ జేబీ, అంజమ్మ, సంధ్య, స్వరూప, ఆశావర్కర్లు లక్ష్మి, గ్రామపంచాయతీ కార్మికులు నర్సింహులు, అంబిరప్ప, దస్తప్ప, కామప్ప, చంద్రు, లక్ష్మి, బుజ్జమ్మ, దేవమ్మ, ఎల్లప్ప, శివప్ప పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు


మేడ్చల్ టౌన్: ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

మేడ్చల్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని అధికారులను సూచించారు. మేడ్చల్ పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అధికారులు మంగళవారం సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో వడ్ల తూకాన్ని, ధాన్యం నిలువలను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సునీల్, రైతులు పాల్గొన్నారు.

**కొడంగల్ రూరల్:** మండలంలోని పర్సాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని సూచించారు.

**కొడంగల్:** మండల కేంద్రంలోని పర్సాపూర్‌లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని నిర్వాహకులకు సూచించారు. సకాలంలో ధాన్యాన్ని మిల్లర్లకు పంపించాలన్నారు.

**దౌల్తాబాద్:** దౌల్తాబాద్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇన్‌చార్జి తహసీల్దార్ చాంద్‌పాషా పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేసి మిల్లర్లకు తరలించాలని నిర్వాహకులను సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వరి కోతలు కోసి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయకపోవడం సరికాదన్నారు. రైతులు కల్లాల దగ్గర ధాన్యం నిల్వలతో పడిగాపులు కాస్తున్నారన్నారు. ఆకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో అనంతయ్య, బాబునాయక్, ప్రవీణ్, నర్సింహులు, రాజునాయక్, పాండ్యానాయక్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేయొద్దు

వరి ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం చేయొద్దని రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్ స్థానిక

**బషీరాబాద్:** ధాన్యం తూకాల్లో జాప్యం జరుగకుండా ఎప్పటి కప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జీవాదరెడ్డి, సొసైటీ చైర్మన్ ఏ.వెంకటరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మైల్వార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు సందర్శించారు.


బషీరాబాద్: మైల్వార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్